క్లుప్తంగా

నిరాశ్రయులకు అన్నదానం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని న్యూ కయనికట్టువీధిలో వీధిలోని మెప్మా, నగరపాలక సంస్థ సహకారంతో సపోర్ట్ సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతిగృహంలో కమిషనర్ అరుణ నిరాశ్రయులకు ఉచితంగా భోజనం ప్లేట్లు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు జోసఫ్ రాజు, సెల్విబాబు, శశిరేఖ, మెప్మా సీఎంఎం గోపి పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో మరింత వృద్ధి

చిత్తూరు రూరల్: చిత్తూరులో విద్యా వ్యవస్థను మరింత వృద్ధి చేయాల్సిన అవసరం ఉందని స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు తాండవ మూర్తి అన్నారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీ, పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన, వలసల నివారణ, హైరోడ్డు ఏర్పాటు, ఇతర అన్ని రకాలైన అభివృద్ధికి ప్రజాప్రతినిధుల కృషి అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శివకుమార్, సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



బైరెడ్డిపల్లి : మండలంలోని కడపనత్తం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బేస్ బాల్ టోర్నీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నందగోపాల్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అండర్-14, 17 విభాగాల్లో పాఠశాల విద్యార్థినులు సుప్రియ, నందిని, మధుమతి పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థినులను పీడీ చిరంజీవి అభినందించారు.

ఈ-కేవైసీతోనే రైతులకు లబ్ధి

ఐరాల: ప్రభుత్వం అమలు చేసే పథకాలు, పంట నష్టపరిహారం, రైతు భరోసా అందాలంటే రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ వరలక్ష్మి సూచించారు. స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ మండలంలో ఇంకా 800 మంది రైతులు ఈ-కేవైసీ చేయుంచుకోలేదన్నారు. ఈ-కేవైసీ చేయించుకోని రైతులు సమీపంలోని మీ సేవ కేంద్రం, గ్రామ సచివాలయంలో సంప్రదించాలని చెప్పారు. ఈకేవైసీ చేయించుకునే రైతుల ఫోన్ నంబర్, ఆధార్ కార్డుతో లింక్ అయి ఉండాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఇంటి పన్ను వసూలుపై దృష్టి

ఐరాల: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ నిర్మలాదేవి సూచించారు. ఆమె శనివారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఫిబ్రవరి చివరి నాటికి ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయాలన్నారు. పంచాయతీల్లో అవసరమైన నిధులు అందుబాటులో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు మౌళిక వసతులు కల్పించాలని సూచించారు. పంచాయతీల్లో చెత్త నుంచి వర్మీకంపోస్టు తయారు చేయాలని, ఆ ఎరువు రైతులకు విక్రయించి పంచాయతీ ఆదాయాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

పోలీస్ శాఖ స్థలం లీజుకు

చిత్తూరు అర్బన్: చిత్తూరు చేపల మార్కెట్ పక్కనున్న పోలీసు శాఖ స్థలాన్ని అద్దె/లీజుకు ఇవ్వనున్నట్లు ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవాళ్లు చిత్తూరు పోలీసు శాఖలోని ఏఆర్ఐ మధును సంప్రదించాలని తెలియజేశారు.

గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా పాలన



గుడిపాల: బుక్‌లెట్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



బంగారుపాళెం: నూనెగుండ్లపల్లెలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

- ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ముంగిట్లోనే వైద్య సేవలు
- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి, ప్రజల ముంగిటకే పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆయన శనివారం మండలంలోని కిల్లారిపల్లె, కొత్తపల్లె, మిట్టూరు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేకి ప్రజలు, నాయకులు, స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం ప్రతి గడప వద్దకు వెళ్లి లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేసి, వారికి అందిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం మహిళా సాధికారతే లక్ష్యంగా 50 శాతం రిజర్వేషన్లు, దిశ చట్టం అమలు చేస్తున్నట్లు తెలిపారు. నవరత్నాలు, సంక్షేమ పథకాలతో జగనన్న రాష్ట్రంలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికారన్నారు. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేశారని, వాటితో అభివృద్ధి పనులు చేయనున్నట్లు స్పష్టం చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు గ్రామాల్లోనే రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇంటివద్దనే వైద్యం అందించేలా సీఎం చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్, చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీలు చిన్నమ్మ, మొగిలిరెడ్డి, సర్పంచ్‌లు పెరిల్లా, రజినీకాంత్, మోహన్, జయకోడి, గుణవతి, మణి వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గడప గడపలో సంతోషం

బంగారుపాళెం: వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి గడపలో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని నూనెగుండ్లపల్లె, తట్రబండ, పాపానివారిపల్లె, మిట్టపల్లె గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. నూనెగుండ్లపల్లెకు నాలుగు నెలల క్రితం 104 సిబ్బంది వచ్చి వృద్ధులు, వికలాంగులకు, గ్రామస్తులకు వైద్య సేవలు అందించేవారన్నారు. నాలుగు నెలల నుంచి రావడంలేదని పలువురు వృద్ధులు ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే గ్రామంలోకి 104 సిబ్బంది వచ్చి వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాపానివారిపల్లెకు తారురోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. మిట్టపల్లెలో సీసీ రోడ్లు, మురికి కాలువలు నిర్మించాలన్నారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రం భవనం వర్షానికి ఉరుస్తోందనీ, పెచ్చులు ఊడుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

గడప గడపకు కార్యక్రమానికి 100 రోజులు

నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 100 రోజులు పూర్తయిన సందర్భంగా కేక్ కట్‌చేశారు. మిట్టపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బాబు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, జడ్పీటీసీ సోమశేఖర్, పారిశ్రామిక వేత్త విద్యాసాగర్, కో- ఆప్షన్ సభ్యుడు ఫిరోజ్‌అహ్మద్, మండల ఎస్సీ సెల్, మైనారిటీ సెల్ అధ్యక్షులు నాగరాజ, హిదాయత్, యూత్ అధ్యక్షుడు జగదీష్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఏపీపీటీడీ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలో శనివారం ఏపీపీటీడీ కార్యాలయ అధికారుల వెల్ఫేర్ అసోసియేషన్ డైరీని ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానంద రెడ్డి ఆవిష్కరించారు. ప్రతి సంవత్సరం డైరీని సొంత ఖర్చులతో ప్రచురించి అందించడం అభినందనీయమన్నారు. అధికారులు షహజాద్, లక్ష్మీ ప్రసాద్, శివప్రసాద్, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం చేసుకోండి



లబ్ధిదారునితో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: సొంతింటి కలను సాకారం చేసుకోవాలని ఎంపీడీఓ గౌరి లబ్ధిదారులను కోరారు. శనివారం మండలంలోని తేనేపల్లె జగనన్న లేఔట్‌ను ఆమె పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా చేయాలని లబ్ధిదారులకు సూచించారు. పనులు పూర్తి చేస్తే ఎప్పటికప్పుడు బిల్లులు జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సుబ్రమణ్యం, ఏఈ శ్రీనివాసులు, సర్పంచ్ లక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నపిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం



చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ దాత్రేయచౌదరి

తవణంపల్లె: చిన్న పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ దాత్రేయచౌదరి సూచించారు. మండలంలోని ఎ.గొల్లపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరంలో డాక్టర్ దాత్రేయచౌదరి 125 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భవతులు, చిన్న పిల్లలకు పరీక్షలు నిర్వహించారు. గర్భవతులు ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరం అన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో వ్యాధులు దూరం అవుతాయన్నారు. అనంతరం కోవిడ్ టీకా రెండవ, బూస్టర్ డోస్‌లను వేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు హెల్ అసిస్టెంట్లు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

పూతలపట్టు: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. తూర్పు రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డిని గెలిపించాలని ఆయన సోదరుడు రాధాకృష్ణారెడ్డి శనివారం వావిల్‌తోట పంచాయతీలో కరపత్ర ప్రచారం చేశారు. పట్టభద్రులకు కలిసి పేర్నాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, యువకులకు కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సాయికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



బుడితరెడ్డి పల్లెలో సేవలు అందిస్తున్న వైద్యులు

యాదమరి: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ కోరారు. మండలంలోని బుడితరెడ్డి పల్లె గ్రామంలో శనివారం 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను నిర్వహించారు. ఈ వైద్య సేవలలో పలువురికి చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. వైద్యాధికారి మాట్లాడుతు ప్రతి నెలా చివరి శనివారం వైద్యబృందం 104 వాహనం ద్వారా గ్రామానికి వచ్చి ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం



శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం చేస్తున్న నేతలు

ఐరాల: వైఎస్సార్‌సీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని సర్పంచ్ తులసిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కరపత్రాలు పంచి ప్రచారం చేశారు. మండలంలోని ఎర్రేపల్లె పంచాయతీలో నమోదు చేసుకున్న పట్టభద్రులను శనివారం కలిసి ప్రథమ ప్రాధాన్యత ఓటును పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి తరపున సాయికృష్ణారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, పార్టీ నేతలు ప్రభాకర్‌రెడ్డి, బెనర్జీరెడ్డి, సదాశివ, ఉమపతిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, గుణ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



ఉర్దూ ఉన్నత పాఠశాలలో రూటా డైరీని ప్రారంభిస్తున్న హెచ్ఎం భాస్కర్ రావు

యాదమరి: బడీడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) జిల్లా అధ్యక్షులు మున్నీర్ అహ్మద్ కోరారు. మండలంలోని 14 కండ్రిగ ముస్లింవాడ గ్రామంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో శనివారం హెచ్ఎం భాస్కర్ రావు చేతుల మీదుగా రూట డైరీని ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు ఉపాధ్యాయులతో మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరింత వేగంగా ఇళ్ల నిర్మాణాలు



తిమ్మసముద్రం లేవుట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: జగనన్న హౌసింగ్ కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులు మరింత ముందుకు సాగాలని నగర కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. కమిషనర్ శనివారం ఉదయం నగర పరిధిలోని తిమ్మసముద్రం, మురకంబట్టులోని జగనన్న హౌసింగ్ కాలనీల్లో పర్యటించారు. అక్కడి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. మార్చి 15 కల్లా నిర్మాణాలు పూర్తి చేయాలని, ఇందుకు అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు. అనంతరం లేఔట్ వారీగా నోడల్ అధికారులు, హౌసింగ్, అమినిటీ కార్యదర్శులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఉగాది నాటికి పూర్తి చేయాల్సిన గృహాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. లబ్ధిదారులను, మేస్త్రీలను సమన్వయం చేసుకొని పనులు రోజూ వేగంగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు ఏసీపీ రామకృష్ణుడు, డీఈ రమణ, హౌసింగ్ ఏఈ శ్రీధర్, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా పారిశుద్ధ్య కార్యక్రమాలు

నగరంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత మెరుగ్గా చేపట్టాలని కమిషనర్ అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులకు ఆదేశించారు. కమిషనర్ 38వ వార్డు పరిధిలో అబూబక్కర్ వీధిలో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. మురుగు నీటి కాలువల్లో పూడిక తొలగించాలని, ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి శుభ్రం చేయించాలని ఆదేశించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. పుష్ కాట్ చక్రాలను మరమ్మతులు చేయించాలని కార్మికులు కోరగా, కమిషనర్ సత్వరం స్పందించారు. పుష్ కాట్‌లకు సత్వర మరమ్మతులు చేయించాలని ఎంహెచ్‌ఓను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డా.లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యప్రభపై ఊరేగిన శ్రీమన్నారాయణుడు







తొడతరలో ఊరేగుతున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి, తవణంపల్లెలో గరుడ వాహనంపై శ్రీరామచంద్రుడు, చిత్తూరులో సూర్య ప్రభ వాహనంపై స్వామివారు, జీడీ నెల్లూరులో సూర్యప్రభ, అశ్వ వాహనాలపై లక్ష్మీ నారాయణస్వామి

- గరుడ వాహనంపై శ్రీరామచంద్రుడి విహారం
- ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో రథ సప్తమి వేడుకలు

చిత్తూరు రూరల్: నగరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రథసప్తమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. వేకువజామున సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం అభి షేక పూజలు చేసి విశేషంగా అలంకరించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి అర్చన కార్యక్రమాలు చేశారు. రథ సప్తమిలో భాగంగా స్వామిని ప్రత్యేకంగా ముస్తా బు చేసి సూర్య ప్రభవాహనంపై ఊరేగించారు. భక్తు లు స్వామి వారిని కర్పూర హారతులతో తరించారు.

హనుమగిరిలో అభిషేకాలు

తవణంపల్లె: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు రథసప్తమి వేడుకలను భక్తిప్రపత్తులతో నిర్వహించి మొక్కులు తీర్చుకొన్నారు. మండలంలోని తొడతరలో శనివారం సీతారామలక్ష్మణులకు అభిషేకం పూజలు నిర్వహించారు. అనంతరం హనుమగిరిలో వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో అర్చకులు అభిషేకం పూజలు నిర్వహించి కల్యాణ వెంకటేశ్వర స్వామికి నైవేద్యం సమర్పించారు. తర్వాత వివిధ పుష్పాలతో అలంకరించిన పల్లకిలో కల్యాణ వెంకటేశ్వర స్వామి కొలువుదీరి తొడతర పరిసరాల్లోని 12 గ్రామాల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. భక్తులు ఊరూరా ఇంటింటా స్వామికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర మంగళహారతులిచ్చి మొక్కులు తీర్చుకొన్నారు.

కోదండరామస్వామి ఆలయంలో..

మండల కేంద్రంలో వెలసిన కోదండరామస్వామి దేవస్థానంలో రథసప్తమి సందర్భంగా సీతారామలక్ష్మణులకు, ఆంజనేయస్వామికి అభిషేకం, పూజలు నిర్వహించారు. ఒకే కొబ్బరికాయలో మూడు చెట్లు పెరగడంతో సీతారామలక్ష్మణులుగా భావించి భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పూజలు ముగిసిన తర్వాత భక్తులకు స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఉభయదారులు పప్పుశెట్టి శ్రీనివాసులు, భార్గవి దంపతులచే గరుడ వాహన సేవను భక్తితో నిర్వహించారు. ఉభయదారులు పూజా సామగ్రి, ప్రసాదాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు శ్రీరాముడికి అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. భక్తులు స్వామికి ఇంటింటా పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర మంగళ హారతులిచ్చి మొక్కులు తీర్చుకొన్నారు. అదే విధంగా ఎగువ మోదలపల్లెలో రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రథసప్తమి వేడుకలను ఆలయ ట్రస్టుబోర్డు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.

వేపంజేరి ఆలయంలో..

గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని ప్రముఖ శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శనివారం రథసప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. సప్త వాహనాలపై శ్రీలక్ష్మీనారాయణ స్వామివారు ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. వేకువజామున సుప్రభాత సేవలో స్వామవారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం అభిషేక పూజలు చేశారు. ఉదయం 7 గంటలకు సూర్యప్రభవాహనం, 9గంటలకు శేష వాహనం, 11 గంటలకు అశ్వవాహనం, ఒంటిగంటకు హంసవాహనం, 3గంటలకు గరుడవాహనం, 5గంటలకు హనుమంతవాహనం, రాత్రి ఏడు గంటలకు చంద్రప్రభవాహనంపై బ్యాండు మేళాల నడుమ స్వామివారు గ్రామపురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. మధ్యాహ్నం ఆలయ ధర్మకర్త శ్రీధర్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. ఆలయ మేనేజర్ వెంకటేశులు రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో

కార్వేటినగరం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలో ఉన్న శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు. ఉభయ దేవేరులతో పాటు స్వామివారిని పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల మధ్య స్వామి,అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటి వద్ద కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 8.30 గంటలకు ఏకాంత సేవ నిర్వహించారు. టీటీడీ సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయ అధికారి సురేష్ పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై దేవదేవేరులు



సూర్యప్రభ వాహనంపై కొలువు తీరిన స్వామివారు

యాదమరి: మండల కేంద్రంలో దేవదేవేరులు సూర్యప్రభ వాహనంపై గ్రామ వీధుల్లో విహరించారు. రథసప్తమి సందర్భంగా ఇంద్రవరదుని ఆలయంలో ఉదయం ఆలయ అర్చకులు మూలస్థానంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదునికి ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుని ఉత్సవ విగ్రహాలను సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి మేళతాళాలతో మంగళ వాయిద్యాలతో పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు దేవదేవరులకు కర్పూర మంగళ హారతులు ఇచ్చి మొక్కలు తీర్చుకున్నారు.

కుటుంబ సభ్యుల వర్గీకరణకు అవకాశం

చిత్తూరు అర్బన్: రేషన్ కార్డ్, నవశకం పోర్టల్లో కుటుంబ సభ్యుల వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు నగర కమిషనర్ అరుణ తెలిపారు. నవశకం పోర్టల్లో కుటుంబ సభ్యుల వర్గీకరణ (హౌస్ ఓల్డ్ మ్యాపింగ్ లో స్ప్లిట్) ఆప్షన్‌ను ఏపీ సేవా పోర్టల్‌లో అందుబాటులోకి వచ్చిందని వివరించారు. అవసరమున్నవారు వారి పరిధిలోని వార్డు సచివాలయంలో వార్డ్ అడ్మిన్ కార్యదర్శి/ఎడ్యుకేషనల్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఒకే కుటుంబంగా ఉన్నందున చాలా మంది సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ సభ్యుల వర్గీకరణకు అవకాశం కల్పించిందని, నిర్దేశించిన పత్రాలతో సంబంధిత వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ కోరారు.

ప్రకటన

చిత్తూరు నగర వాసులకు విజ్ఞప్తి. చిత్తూరు పరిసర ప్రాంతాలలో రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ నందు నూతనంగా ప్రారంభించు రిజిస్ట్రేషన్ ప్రీమియం సెంటర్ కొరకు 5000 నుండి 10000 చదరపు అడుగులు వరకు విస్తీర్ణం గల గ్రౌండ్ ఫ్లోర్ మరియు ఫస్ట్ ఫ్లోర్ మరియు కారు పార్కింగ్ సౌకర్యము గల భవనమును అద్దెకు కావలెనని కోరడమైనది. ఆసక్తి కలిగినవారు ఈ క్రింది చిరునామాకు సంప్రదించగలరు.

డిస్ట్రిక్ట్ రిజిస్ట్రారు: ✆ 7093921636
సీనియర్ సహాయకులు: ✆ 9392123818

సం/- జిల్లా రిజిస్ట్రారు, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ చిత్తూరు

భారతీయ స్టేట్ బ్యాంక్
కొంగారెడ్డి పల్లి శాఖ-13176, చిత్తూరు. ✆ 08572-235405
బంగారు నగల వేలము ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా ఈ దిగువ పేర్కొన్న వ్యక్తులు మా బ్యాంకు ద్వారా గృహ/వ్యవసాయ/ వ్యాపార అవసరాల నిమిత్తం పొందిన ఋణములు సక్రమంగా చెల్లించనందున వీరు పొందిన అన్ని ఋణములను RBI వారి ఉత్తర్వుల మేరకు నిరర్థక (NPA) ఆస్తులు గా పరిగణించడమైనది. ఇందులో మా బ్యాంకు నుండి బంగారు నగల హామీతో వ్యవసాయ అవసరముల కొరకు పొందిన ఋణములు కూడా ఉన్నవి. కావున వీరు ఋణము కొరకు మా వద్ద ఉంచిన బంగారు నగలను 03.02.2023వ తేదీ శుక్రవారం సా.5 గం.లకు మా బ్యాంకు ఆవరణలో బహిరంగ వేలం వేయబడును. అట్లు వచ్చిన మొత్తమును వీరి అప్పులకు జమచేసి, మిగిలిన అప్పు మొత్తమును, వీరు వ్రాసియిచ్చిన ప్రామిసరి నోటును ఉపయోగించి చట్టబద్ధముగా వసూలు చేయబడును.

వ. నెం.	అకౌంట్ నెంబరు	ఋణగ్రహీత పేరు/ తండ్రి పేరు చిరునామా	బంగారం బరువు(గ్రా॥ల్లో)
1.	39745610965	పి.కవిత భర్త పి.గోవిందరాజులు, 4-20, రఘునాథపురం ఆదిలక్ష్మమాంబపురం, గుడిపాల, చిత్తూరు	60.48

షరతులు: (1) ఈ ప్రకటన ఖర్చు అప్పుదారుడే భరించవలెను. (2) వేలములో పాల్గొనదలచినవారు రూ.10000/- ధరావత్తు చెల్లించి పాల్గొనవచ్చును. (3) వేలమును పొందినవారు మిగిలిన సొమ్మును వెంటనే చెల్లించి నగలు స్వాధీనం చేసుకొనవలెను. లేనిచో ధరావత్తు కోల్పోవుదురు. (4) ఎటువంటి కారణములు తెలుపకనే వేలము వాయిదా వేయుటకు గాని, రద్దు పరచుటకు గాని బ్యాంకు వారికి అధికారము కలదు.

సం/- బ్రాంచి మేనేజరు, భారతీయ స్టేట్ బ్యాంక్, కొంగారెడ్డిపల్లి శాఖ, చిత్తూరు